


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
11-11-2025
పేజీలు: 02

# మందకొండిగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పోలింగ్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటింగ్ మందకొడిగా సాగుతోంది. అయితే ఓ వృద్ధురాలు వీల్ చైర్‌లో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె, అందరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఓటు వేయకుంటే చచ్చిపోయినట్టే లెక్క అన్నారు. కష్టమయిన సరే వచ్చి ఓటు వేయాలని కోరారు. నడవలేకున్నా అయినా సరే వచ్చి ఓటు వేస్తున్నానని, యువకులు ఇళ్ల నుండి వచ్చి ఓటు వేయాలని సూచించారు.

**పోలింగ్ బూత్ నెంబర్ 67 లో మరో ఫేక్ ఓటర్**

మహిళా ఓటర్ తన ఓటు వేసేందుకు రాగా.. అప్పటికే తన ఓటు వేరే వాళ్ళు వేశారని ఆవేదన పోలింగ్ అధికారులు సమాధానం చెప్పడం లేదని వాపోయినా మహిళా ఓటర్ భర్త జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటింగ్ మందకొడిగా సాగుతోంది. అయితే ఓ వృద్ధురాలు వీల్ చైర్‌లో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె, అందరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఓటు వేయకుంటే చచ్చిపోయినట్టే లెక్క అన్నారు. కష్టమయిన సరే వచ్చి ఓటు వేయాలని కోరారు. నడవలేకున్నా అయినా సరే వచ్చి ఓటు వేస్తున్నానని, యువకులు ఇళ్ల నుండి వచ్చి ఓటు వేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆర్.వి కర్ణన్ పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రతీ ఓటర్ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్ణన్ సూచించారు. మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్ పోలింగ్‌బూత్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓటేశారు. కుటుంబంతో కలిసి ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు ఓటేయాలని ఆయన పిలుపునిచ్చారు.





## ఢిల్లీ పేలుడు ఘటనలో పెరిగిన మృతుల సంఖ్య

ఢిల్లీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. నిన్న తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇవాళ మరో ముగ్గురు మరణించినట్లు ఢిల్లీ పోలీసులు మంగళవారం ప్రకటించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 12కి పెరిగింది. చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర ఉన్న సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది దుర్మరణం పాలవ్వగా, 20 మందికి గాయాలయ్యాయి. క్షతగ్రాత్రులను స్థానిక లోక్‌నాయక్ జయప్రకాశ్ (ఎల్ఎన్‌జేపీ) దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు పేలుడు ఘటనపై యూఏపీఏ చట్టం కింద ఢిల్లీ పోలీసులు కేసు బుక్ చేశారు. కోత్వాలి పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16, 18 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కూడా కేసులు బుక్ చేశారు. ప్రస్తుతం పలు ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని హై అలర్ట్‌లో ఉన్నది. ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్, బస్ టర్మినల్ల వద్ద బందోబస్తు పెంచారు.



## నాన్న చనిపోలేదు.. ఆయన క్షేమంగా ఉన్నారంటూ కూతురి క్లారిటీ

భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఆ వార్తలను ధర్మేంద్ర కుమార్తె ఇషా డియోల్ ఖండించారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తన తండ్రి ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. ప్రస్తుతం కోలుకుంటున్నారని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు. ధర్మేంద్ర ముంబైలోని బ్రీచ్ కాండీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన వయసు 89 సంవత్సరాలు. గత కొన్ని రోజులుగా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ధర్మేంద్ర ఆసుపత్రిలో చేరారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నారు.ధర్మేంద్రను చూసేందుకు పలువురు సినీ తారలు ఆసుపత్రికి చేరుకున్నారు. షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, సన్నీ డియోల్, బాబీ డియోల్, ఆయన భార్య హేమ మాలిని, కుమార్తె ఇషా డియోల్ సహా పలువురు ప్రముఖులు సోమవారం రాత్రి ఆసుపత్రికి వెళ్లినట్టు సమాచారం. 1958లో దిల్ బీ తేరా హమ్ బీ తేరే చిత్రంతో తెరంగేట్రం చేసిన ధర్మేంద్ర, తన కెరీర్‌లో "షోలే", "చుప్కే చుప్కే", "ధర్మ్ వీర్", "సీటా ఔర్ గీత", "యాదోం కి బారాత్" వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు "హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్" అనే బిరుదు ఇచ్చారు.

## అదే లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ ముందడుగు

### మంత్రి నిమ్మల రామానాయుడు




నాలుగు దశాబ్దాల సుధీర్ఘ అనుభవంతో చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ వైపు అడుగులు వేయిస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అంతర్జాతీయంగా సీబీఎన్ అంటే ఒక బ్రాండ్ అని.. ఆయన సీఎంగా ఉన్నారంటే పారిశ్రామికవేత్తలకు ఒక నమ్మకం, గౌరవమని చెప్పకొచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లోనే రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో 9.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ పని చేస్తున్నారని వెల్లడించారు. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉంటే నేడు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పెట్టుబడిదారులను ఆకట్టుకుంటున్నామని తెలిపారు. ఏపీ ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ ఎంఈ పాలసీ, ఏపీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ పాలసీలతో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ, క్లస్టర్ బేస్డ్ అభివృద్ధిపై దృష్టిసారించిందని చెప్పకొచ్చారు. రాష్ట్రంలో విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలను మెగా సిటీలుగా అభివృద్ధి చేయడంతో పాటు, ఈ మెగా సిటీలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చేయనుందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు, ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. పారిశ్రామికవేత్తలను, పరిశ్రమలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రమ్మంటుంటే, రాష్ట్రంలో మళ్ళీ జగన్ రాడు అనే గ్యారంటీ ఇవ్వమంటున్నారని మంత్రి తెలిపారు. అమర్ రాజా బ్యాటరీస్, కియా అనుబంద సంస్థలు, జాకీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, లులూ, బిఆర్‌షెట్టి గ్రూప్, టైటాన్ ఎలక్ట్రానిక్స్, వంటి పరిశ్రమలతో పాటు ఫార్చ్యూన్ వంటి 500 కంపెనీలను కూడా జగన్ బలవంతంగా పక్క రాష్ట్రాలకు తరిమేశారని మండిపడ్డారు. మరలా జగన్ వస్తే రప్పా,రప్పా నరుకుతామని.. టెండర్లు రద్దు చేస్తామని.. విధ్వంసం చేస్తామంటూ పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



## మూడు రోజుల పాటు ఎర్రకోట బంద్

దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 13 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. అయితే ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు విజిటర్స్‌కు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది.

## ఢిల్లీలో డేంజర్‌బెల్స్ మోగిస్తోన్న వాయు కాలుష్యం.. ఆంక్షలు అమల్లోకి



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. మంగళవారం ఉదయం గాలి నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. ఏక్యూఐ లెవెల్స్ 425కుపైనే నమోదయ్యాయి. వాయు కాలుష్యం క్షీణించడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో జీఆర్ఏపీ స్టేజ్-3 ఆంక్షలు విధించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం.. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో సోమవారం ఉదయం 362గా ఉన్న ఏక్యూఐ లెవెల్స్.. మంగళవారం ఉదయానికి 425గా నమోదయ్యాయి. దీంతో రాజధానిలో ప్రభుత్వం పలు ఆంక్షలు విధించింది. అనవసరమైన నిర్మాణాలు, కూల్చివేత పనులపై నిషేధం విధించింది. వాహన కాలుష్యాన్ని అరికట్టడంలో సహాయపడటానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ కింద మూడో దశ ఆంక్షలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



## పట్టణాల్లో సహకార బ్యాంకులు: కేంద్రం సంచలన ప్రకటన

ఢిల్లీలో జరిగిన 'కో-ఆప్ కుంభ్' కార్యక్రమంలో కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, ఐదేళ్లలో రెండు లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రతి నగరంలో ఒక పట్టణ సహకార బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండు సంవత్సరాల్లో 1,500 బ్యాంకులను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో అనుసంధానించాలని సూచించారు. బ్యాంకుల ఆర్థిక స్థితి మెరుగై ఎన్‌పిఎలు 2.8% నుంచి 0.6%కు తగ్గాయని చెప్పారు. చిన్న పట్టణాలకు సేవలు విస్తరించాలన్నారు.



## ముగిసిన అందెశ్రీ అంత్యక్రియలు.. హాజరైన సీఎం రేవంత్

ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ. హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాక్య విమలక్క పాల్గొన్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళులు అర్పించారు.



## డాన్స్‌తో ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోన్న పూజా హెగ్డే

బుట్టబొమ్మ పూజా హెగ్డే ఈ ఏడాది మూడు సినిమాలతో మెరిసింది. రెండు చిత్రాల్లో(దేవా, రెట్రో) హీరోయిన్‌గా నటించగా, మరో మూవీలో స్పెషల్ సాంగ్ చేసింది. రజనీకాంత్ `కూలీ`లో ఆమె స్పెషల్ సాంగ్‌లో మెరిసిన విషయం తెలిసిందే. `మోనికా` అంటూ ఉర్రూతలూగించింది. ఆ పాట విపరీతంగా ఆకట్టుకుంది. చాలా రోజులపాటు ఇందులో పూజా స్టెప్పులు, ఆమెతోపాటు సౌబిన్ డాన్స్ వైరల్‌గా మారింది. ఇక ఇప్పుడు మరో పాటతో దుమ్మురేపుతోంది పూజా హెగ్డే. దళపతి విజయ్‌తో కలిసి అదిరిపోయే స్టెప్పులేసింది. తాజాగా ఆమె డాన్స్ క్లిప్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.పూజా హెగ్డే తాజాగా దళపతి విజయ్‌తో కలిసి `జన నాయకుడు` చిత్రంలో నటిస్తోంది. మమితా బైజు మరో హీరోయిన్. హెచ్ వినోద్ దర్శకత్వంలో ఈ చిత్ర రూపొందుతుంది. కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మిస్తోంది. ప్రస్తుతానికి విజయ్ నటిస్తోన్న చివరి చిత్రమిదే. ఆయన రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన నేపథ్యంలో ఈ సినిమా తర్వాత విజయ్ పూర్తిగా రాజకీయాలపై ఫోకస్ పెట్టబోతున్నారు. దీంతో ఈ సినిమా చేస్తున్నారు. దీన్ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూపొందిస్తున్నారు దర్శకుడు వినోద్. ఇందులో విజయ్‌తో రొమాన్స్ చేస్తోంది పూజా.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## అందాలతో కాకరేపుతున్న రకుల్

సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ షో బిగ్‌బాస్ సీజన్ 19లో రకుల్ ప్రీత్ సింగ్ టీం సందడి చేసింది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఫస్ట్ పార్ట్‌లో తనకంటే వయసులో చాలా చిన్నదైన ఆయేషా (రకుల్ ప్రీత్ సింగ్)ను ప్రేమ పెళ్లి చేసుకోవాలి అనుకున్న ఆశిష్ (అజయ్ దేవగణ్) తన మాజీ భార్య (టబు) పర్మిషన్‌తోపాటు ఆమె కుటుంబం అంగీకారాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు. ఆయేషా కుటుంబాన్ని ఆశీష్ ఎలా పెళ్లికి ఒప్పిస్తాడు అనే నేపథ్యంలో సీక్వెల్ సాగనుందని ఇప్పటికే ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. సీక్వెల్‌లో ఆయేషా తండ్రి రోల్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ ఆర్. మాధవన్ నటిస్తున్నాడు.



# ఢిల్లీ పేలుడుకు కారణమైన వారిని వదిలే ప్రసక్తే లేదు



రెండ్రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం భూటాన్ చేరుకున్నారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రధాని మోదీకి భూటాన్ ప్రధాని స్వాగతం పలికారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య స్నేహం, సహకారం ప్రత్యేక సంబంధాలను బలోపేతం చేయడమే ప్రధాని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. భారతదేశం, భూటాన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన 1020 మెగావాట్ల పునత్సాంగ్చు-2 జలవిద్యుత్ ప్రాజెక్టును మోదీ, ఆదేశ ప్రధాని కింగ్ వాంగ్చుక్ సంయుక్తంగా ప్రారంభించనున్నారు. అలాగే భూటాన్ నాల్గవ రాజు జిగ్మే సింగ్యే వాంగ్చుక్ 70వ జయంతి వేడుకలకు ప్రధాని మోదీ హాజరుకానున్నారు. భూటాన్ చేరకున్న ప్రధాని మోదీ అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఈ రోజు చాలా బరువైన హృదయంతో ఇక్కడికి వచ్చానని ఆయన అన్నారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన భయంకరమైన సంఘటన అందరినీ తీవ్రంగా బాధపెట్టిందన్నారు. బాధిత కుటుంబాల బాధను తాను అర్థం చేసుకున్నానని.. దేశం మొత్తం వారికి అండగా నిలుస్తుందన్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్న అన్ని సంస్థలతో తాను ఎప్పికప్పడూ సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. త్వరలోనే దర్యాప్తు సంస్థలు ఈ కుట్ర మూలాన్ని కనుగొంటారని.. దీని వెనుక ఉన్న కుట్రదారులను వదిలిపెట్టే ప్రస్తక్తే లేదని హెచ్చరించారు.

## బూకర్ ప్రైజ్ గెలిచిన హంగేరి రచయిత డేవిడ్

హంగేరికి చెందిన బ్రిటీష్ రచయిత డేవిడ్ సాలే .. 2025 బూకర్ ప్రైజ్ గెలుచుకున్నారు. ఫ్లెష్ అనే నవలకు గాను ఆయనకు ఈ అవార్డు వరించింది. లండన్‌లో సోమవారం రాత్రి బూకర్ ప్రైజ్ వేడుక జరిగింది. భారతీయ రచయిత కిరణ్ దేశాయ్ రాసిన ద లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ నవల తీవ్ర పోటీ ఇచ్చింది. కానీ చివరకు డేవిడ్ రాసిన నవలకు అవార్డు దక్కింది. 51 ఏళ్ల డేవిడ్ సాలేకు సుమారు 50 వేల పౌండ్ల నగదు పురస్కారం అందజేశారు. గత ఏడాది విన్నర్ సమంతా హార్వే చేతుల మీదుగా ట్రోఫీని బహూకరించారు. కిరణ్ దేశాయ్ రెండోసారి ఈ అవార్డు కోసం పోటీపడ్డారు. 2006లో రాసిన ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్ నవలకు ఆమెకు బూకర్ ప్రైజ్ వచ్చింది. అయితే ఈ సారి కూడా ఆ అవార్డు కోసం ఆమె తీవ్ర పోటీపడ్డారు.







## బ్లాస్ట్‌తో ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లపై నిఘా

దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో బ్లాస్ట్ తర్వాత భద్రతా సంస్థలను అప్రమత్తం చేశారు. ఈ సంఘటన తర్వాత అన్ని సున్నితమైన ప్రాంతాల్లో అధికారులు నిఘా పెంచారు. ప్రధాన రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినల్స్ వద్ద ఢిల్లీ పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, కేంద్ర భద్రతా సంస్థలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. అదనపు సిబ్బందిని మోహరించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు. ప్రయాణికులను, వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రాజధానిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు అయిన న్యూఢిల్లీ, ఓల్డ్ ఢిల్లీ, ఆనంద్ విహార్, హజ్రత్ నిజాముద్దీన్ వద్ద అదనపు పోలీసు దళాలను మోహరించారు. ఏదైనా సంఘటన జరిగితే ఎదుర్కొనేందుకు భద్రతా సంస్థలన్నీ అప్రమత్తంగా ఉన్నాయి. కశ్మీర్ గేట్, సారాయ్ కాలే ఖాన్, ఆనంద్ విహార్ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్స్ వద్ద తనిఖీలను కఠినతరం చేశారు. పోలీసు బృందాలు నిరంతరం ప్రయాణికులను పర్యవేక్షిస్తూ వాహనాల తనిఖీని చేస్తున్నాయి. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే గుర్తించడానికి బస్ టెర్మినల్స్ ఎంట్రీ, ఎగ్జిట్ల వద్ద బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, ఢిల్లీ మెట్రో స్టేషన్లలో భద్రతా సంస్థలు నిఘా వేశాయి. పుకార్లను నమ్మకూడదని.. ఏదైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీ, ఓల్డ్ ఢిల్లీ, ఆనంద్ విహార్ టెర్మినల్, హజ్రత్ నిజాముద్దీన్, సారాయ్ రోహిల్లాతో సహా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఉత్తర రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ హిమాన్షు శేఖర్ తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, పీఆర్పీ అదనపు బృందాలను మోహరించినట్లు పేర్కొన్నారు. ప్లాట్‌ఫారమ్‌లు, స్టేషన్ ఆవరణ, ప్రవేశ ద్వారాలపై తనిఖీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. మెటల్ డిటెక్టర్లు, బ్యాగేజ్ స్కానర్లతో సోదాలు చేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లలో ఏదైనా అలసత్వాన్ని సహించబోమని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. అయితే, రైల్వేస్టేషన్‌కు వెళ్తున్న సమయంలో వెంట గుర్తింపు కార్డును తీసుకెళ్లాలని.. లేకపోతే ఇబ్బందులు పడే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

## నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి రూ. కోటి ఫైన్

నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌లో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా గర్భిణి అస్నాల స్వాతి మరణించిన కేసులో జిల్లా వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలి కుటుంబానికి రూ. 1 కోటి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. 2018 జూలై 13న డెలివరీ కోసం చేరిన స్వాతికి అనస్థీషియా ఇచ్చిన తర్వాత బాబు జన్మించాడు. స్పృహలోకి రాకపోవడంతో అదనపు మత్తుమందు డోస్ ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. చివరకు 14వ తేదీ ఉదయం స్వాతి మరణించినట్లు ప్రకటించారు. భర్త క్రాంతికుమార్, తండ్రి సత్యనారాయణ ఫిర్యాదుపై విచారణ అనంతరం ఫోరం డాక్టర్ల నిర్లక్ష్యం స్పష్టమైందని పేర్కొంది.
వినియోగదారుల ఫోరం సంచలనాత్మక తీర్పు
2018లో నార్కట్‌పల్లి కామినేని



హాస్పిటల్‌లో ప్రసూతి సమయంలో గర్భిణి స్వాతి మృతి చెందిన కేసులో, బాధిత కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలని నల్లగొండ జిల్లా వినియోగదారుల ఫోరం హాస్పిటల్ యాజమాన్యాన్ని ఆదేశించింది. 9 జూలై 2018న ప్రసూతి కోసం ఆసుపత్రిలో చేరిన స్వాతికి 13వ తేదీ రాత్రి సర్జరీ జరిగింది. రెండుసార్లు మత్తు మందు ఇవ్వడం వల్ల వైద్యం వికటించి 14వ తేదీన ఆమె మృతి చెందింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఫోరం ఈ తీర్పు వెల్లడించింది.

## మెరిసిన మను, ఇషా



ప్రతిష్టాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. సోమవారం జరిగిన మహిళల 25మీటర్ల పిస్టల్ టీమ్‌ఈవెంట్‌లో భారత త్రయం ఇషాసింగ్ (583), మనుభాకర్ (580), సురుచి ఇందర్‌సింగ్ (577) 1740 స్కోరుతో రజత పతకంతో మెరిసింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన తుదిపోరులో ఇషాసింగ్, మను భాకర్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఫైనల్‌కు ముందు జరిగిన అర్హత పోరులో ఇషా స్థాయికి తగ్గ ఆటతీరు కనబరిచింది. 13 ఏండ్ల వయసులోనే జాతీయ చాంపియన్ అయిన ఇషా 583 స్కోరుతో నాలుగో స్థానంతో ఫైనల్ బెర్తు దక్కించుకుంది. మరోవైపు డబుల్ ఒలింపియన్ మనుభాకర్ 580 స్కోరుతో ఆరో స్థానంతో తుది పోరులో నిలిచింది. 19 ఏండ్ల యువ షూటర్ సురుచి కూడా జతకలువడంతో భారత్‌కు వెండి పతకం ఖాయమైంది. అంతకుముందు జరిగిన 25మీటర్ల వ్యక్తిగత పోరులో ఇషాసింగ్, మనుభాకర్ పతకాలు దక్కించుకోలేకపోయారు.




## ఎవరిపైనా కుట్ర చేయడం లేదు.. డ్రెస్సింగ్ రూమ్‌లో అంతా ఓకే..!

టీ20ల్లో భారత జట్టు బెంచ్ బలం గట్టిగానే ఉన్నా ఆస్ట్రేలియా పర్యటనలో వారిని ఉపయోగించుకోలేదనేది వాస్తవం. వరుసగా విఫలమవుతున్నా సరే వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు, పేసర్ హర్షిత్ రానాకు ఎక్కువ అవకాశాలివ్వడం తీవ్ర దుమారం రేపింది. కోచ్ గౌతం గంభీర్ ఉద్దేశపూర్వకంగానే కొందరికి వంత పాడుతున్నారని, మ్యాచ్ విన్నర్లపై కుట్ర పన్నుతున్నారనే వార్తలు వైరలయ్యాయి. తనను లక్ష్యంగా చేసుకొని వ్యాపిస్తున్న ఈ విమర్శలపై కోచ్ గౌతీ స్పందించాడు. ఆస్ట్రేలియా పర్యటన ముగియడంతో నోరు విప్పిన అతడు.. తాను ఎవరిపైనా కుట్ర పన్నడం లేదని పేర్కొన్నాడు.

## ఢిల్లీలో పేలుడు.. అనుమానితుడు ఉమర్ అహ్మద్ ఫొటో వైరల్

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనలో 13 మంది మృతి చెందారు. పోలీసులు యూఏపీఏ, ఎక్స్‌ప్లోసివ్ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అనుమానితుడు డాక్టర్ ఉమర్ అహ్మద్ ఫొటో బయటకు వచ్చింది. ఉమర్‌కు ఫరీదాబాద్ మాడ్యూల్‌తో సంబంధాలున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. కారులో అమ్మోనియం నైట్రేట్, డిటోనేటర్లు ఉన్నట్లు తేలింది. కారులోని మృతదేహం ఉమర్‌దే అన్న అనుమానంతో పోలీసులు డీఎన్ఏ శాంపిల్ సేకరించారు.



## పోలీసుల తీరుపై మాగంటి సునీత ఆగ్రహం

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా పోలీసుల తీరుపై బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. బోరబండ పోలింగ్ బూత్ పరిశీలించేందుకు వెళ్తుండగా ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు తనను పోలీసులు అడ్డుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికులు కాకపోయినా కాంగ్రెస్ నాయకులను లోపలికి పంపిస్తున్నారని, అభ్యర్థి అయిన తనను ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులను నిలదీశారు.



## నా కలల టోర్నీ అదే.. అవకాశమిస్తే రఫ్ఫాడిస్తా..!




టీ20లు అంటేనే చిచ్చరపిడుగుల హవా. ఈ ఫార్మాట్‌లో దంచికొట్టే ఆటగాళ్లు చాలామందే ఉన్నా తానే టాప్ అని చాటుకుంటున్నాడు భారత ఓపెనర్ అభిషేక్ శర్మ. ఐపీఎల్ నుంచి ఈ ఏడాది అంతర్జాతీయ మ్యాచ్లలోనూ అదరగొడుతున్న అభి పొట్టి క్రికెట్‌ను ఏలుతున్నాడు. ప్రత్యర్థి ఎవరైనా సరే దంచుడే పరమావధిగా ఆడుతున్న ఈ యంగ్‌స్టర్ నంబర్ 1 ర్యాంక్‌లో తిష్ట వేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన అభిషేక్ తన కలల టోర్నీ కోసం ఎదురుచూస్తున్నాని అంటున్నాడు. ఇంతకు అతడి డ్రీమ్ టోర్నీ ఏంటో తెలుసా..? పొట్టి క్రికెట్‌లో భీకర ఫామ్‌తో బౌలర్లకు దడ పుట్టిస్తున్న అభిషేక్ శర్మ ఓపెనర్‌గా స్థిరపడిపోయాడు. మెరుపు బ్యాటింగ్‌తో శుభారంభాలు ఇస్తూ టీమిండియాకు ప్రధాన అస్త్రంగా మారిన అతడు వరల్డ్ కప్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ కోసం తాను సిద్ధమవుతున్నట్టు చెప్పాడీ సూపర్ స్ట్రయికర్. 'వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ నా కెరీర్లోనే అతిపెద్ద టోర్నీ కానుంది. చెప్పాలంటే అది నా కలల టోర్నమెంట్. నేను వరల్డ్ కప్ కోసం సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నాకు ఈ మెగా ఈవెంట్‌లో ఆడే అవకాశం వస్తే రఫ్ఫాడిస్తా' అని తన మనసులోని మాట చెప్పేశాడీ డాషింగ్ ఓపెనర్. ఆసియా కప్‌లో 314 రన్స్‌తో చెలరేగిన అభిషేక్.. ఆసీస్ గడ్డపై విధ్వంసక ఆటతో రెచ్చిపోయాడు. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌లోనే వెయ్యి పరుగుల క్లబ్‌లో చేరాడు.